

రామయ్యకు నిధులేవి?

రాష్ట్రప్రభుత్వం కొండగట్టు ఆలయానికి నిధులు కేటాయించినట్లుగానే భద్రాద్రి ఆలయానికి కూడా మంజూరు చేయాలని భక్తులు కోరుతున్నారు. 8లో



విషం కక్కుతున్న ఐటీ సెల్

కేంద్రప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిపై బీజేపీ తన ఐటీ సెల్ ద్వారా విషం కక్కుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం ఆరోపించారు. 8లో



వాతావరణం

శనివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది. సాయంత్రం దాటాక కొన్ని ప్రాంతాల్లో చలి పెరుగుతుంది.

ఉచిత విద్యుత్ ఘనత వైఎస్‌దే..

- రైతులకు బేడీలు వేయించిన చరిత్ర బీఆర్‌ఎస్‌ది
- కాంగ్రెస్ హయాంలో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తాం
- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు ప్రజాకోర్టులో శిక్ష
- పాలకులపై పోరాటంలో కమ్యూనిస్టులు కలిసిరావాలి
- 'హాథ్ సే హాథ్ జోడో' యాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి





టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రలో గిరిజన మహిళలు, నాయకులు (ఇన్‌సెట్) లింగాల క్రాస్ వద్ద మాజీమంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రేవంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఆనాడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో తొమ్మిది గంటలపాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఆయన చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర శుక్రవారం జిల్లాలోని కామేపల్లి మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, తాము అధికారంలోకి వస్తే అమలుచేయనున్న పథకాలను వివరిస్తూ ఆయన ముందుకు సాగారు. అనంతరం కామేపల్లి మండలం కొత్త లింగాల క్రాస్‌రోడ్డు వద్ద రాత్రి ఏర్పాటుచేసిన బహిరంగ సభలో రేవంత్ మాట్లాడారు. చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేసిన వైఎస్.. రైతుల కష్టాలను చూసి అధికారంలోకి రాగానే ఉచిత విద్యుత్ అందించారని గుర్తుచేశారు. అలాగే రూ.1,250 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేస్తూ వైఎస్ మొదటి సంతకం చేశారని తెలిపారు. కానీ తెలంగాణ సెంటిమెంట్ పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాల కారణంగా విద్యుత్ లోపాలతో పంటలు ఎండిపోతున్నాయని.. తద్వారా రైతులు సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో 29 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. 24 గంటలు ఉచిత విద్యుత్ ఇవ్వడం కేసీఆర్‌కు సాధ్యం కాకపోగా.. గిట్టుబాటు ధర అడిగితే ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన ఘటనను రైతులు మరచిపోలేదన్నారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

ఉరి తీసినా తప్పులేదు

కాంగ్రెస్ పార్టీ గుర్తు పై గెలిచి, పార్టీ ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలను ప్రజా కోర్టులో శిక్షించాలని, వారిని రాజకీయంగా బొంద పెట్టాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపై ఉందని.. వారిని ప్రజాకోర్టులో ఉరి తీసినా తప్పులేదని రేవంత్‌రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో ఫిరాయింపుదారులకు డిపాజిట్లు రాకుండా ఓడించాలని పిలుపునిచ్చారు. కాగా, అభిమానంతో గెలిపించిన స్థానిక ఎమ్మెల్యే ఇక్కడి ప్రజలకు ద్రోహం చేసి ఫిరాయింపులకు పాల్పడిందని విమర్శించారు. నిజంగా బీజేపీ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని భావిస్తే 12 మంది ఎమ్మెల్యేలపై కూడా సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే బండి సంజయ్, కిషన్‌రెడ్డి కూడా కేసీఆర్‌కు లొంగిపోయినట్లే భావించాల్సి వస్తుందన్నారు. నకిలీ వితనాల్లా.. తెలంగాణ రాజకీయాల్లో నకిలీ నాయకులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కమ్యూనిస్టులూ.. కలిసిరండి

రాష్ట్రంలో కల్వకుంట్ల రాజ్యాన్ని ఖతం చేసి.. ప్రజా రాజ్యాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ పోరాటంలో కమ్యూనిస్టులు తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ హామీ ఇచ్చినట్లుగా డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయలేదని పేర్కొన్నారు. ఏది ఏమైనా వచ్చే ఏడాది జనవరి 1న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ వెంటనే ఇల్లు కట్టుకునే ప్రతీ పేదకు రూ.5 లక్షలు, రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేయడమే కాక ఖాళీగా ఉన్న రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, అటవీ భూముల హక్కుల చట్టం ప్రకారం పోడు భూములకు పట్టాలిస్తామని తెలిపారు. ఇక బయ్యారం ఉక్కు కర్మాగారం కోసం 26 జనవరి 2024న శిలాఫలకం వేసి వేలాది యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. సరిహద్దుల్లో కన్నుమూసిన సంతోష్‌బాబు భార్యకు ఉద్యోగం ఇచ్చిన ప్రభుత్వానికి, కామేపల్లికి చెందిన జవాన్ చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు చేతులు రావడం లేదని మండిపడ్డారు.

అందరికీ సహకరించిన నాయకుడు రాంరెడ్డి

ప్రజలకు సేవ చేసేందుకు రాంరెడ్డి సోదరులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టారని రేవంత్‌రెడ్డి తెలిపారు. అందరికీ సహకరించిన గొప్ప నాయకుడు రాంరెడ్డి వెంకట్‌రెడ్డి అని కొనియాడారు. ఎమ్మెల్యే మరణిస్తే వారి కుటుంబ సభ్యులను ఏకగ్రీవం చేసే సంప్రదాయం ఉండేదని, కానీ వెంకట్‌రెడ్డి మరణించినప్పుడు ఉప ఎన్నికలో ఆయన భార్యను తాము పోటీకి దింపితే టీఆర్‌ఎస్ నుంచి అభ్యర్థిని పెట్టి ఆ కుటుంబాన్ని అవమానించారని పేర్కొన్నారు. కాగా, రాంరెడ్డి వెంకట్‌రెడ్డి కుటుంబానికి రాజకీయంగా ప్రాధాన్యం ఇస్తామని, ఈ విషయంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీతో మాట్లాడతానని రేవంత్ తెలిపారు. ఇంకా ఈ యాత్రలో మాజీ ఎంపీ పోరిక బలరాంనాయక్, నేతలు మల్లు రవి, ఖమ్మం, సూర్యాపేట డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, చెవిటి వెంకన్నయాదవ్‌తో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి కృష్ణారెడ్డి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, బానోత్ వెంకట ప్రవీణ్‌కుమార్‌నాయక్, నల్లమోతు లక్ష్మయ్య, గింజల నరసింహారెడ్డి, ఎం.డీ.ముస్తఫా, మద్ది శ్రీనివాసరెడ్డి, భూక్యా దళ్‌సింగ్, డాక్టర్ రామచంద్రనాయక్, గుగులోతు రవి, చీమల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



గోవింద్రాల బంజరలో రేవంత్‌రెడ్డికి హారతి ఇస్తున్న మహిళలు



ఇంటికి స్టిక్కర్ అంటించి కాంగ్రెస్ విధానాలను వివరిస్తున్న రేవంత్‌రెడ్డి

అందరికీ ఉత్తమ విద్యే లక్ష్యం



సాయిబాబా ఆలయంలో పూజ చేస్తున్న ఎంపీ పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్యే సండ్ర, మాజీ మంత్రి తుమ్మల

- రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి
- కందుకూరులో కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన
- హాజరైన ఎమ్మెల్యే సండ్ర, మాజీ మంత్రి తుమ్మల



కాలేజీ నిర్మాణానికి తన తండ్రి శ్రీనివాసరెడ్డితో కలిసి పూజ చేస్తున్న ఎంపీ

వేంసూరు: ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీకి నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు, హెటిరో డ్రగ్స్ అధినేత బండి పార్థసారథిరెడ్డి తెలిపారు. మండలంలోని కందుకూరులో బండి సోమకాంతం మెమోరియల్ జూనియర్ కాలేజీ భవన నిర్మాణానికి తన తండ్రి బండి శ్రీనివాసరెడ్డితో కలిసి ఎంపీ శుక్రవారం భూమి పూజ చేశారు. ఆతర్వాత ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి శంకుస్థాపన చేసిన ఎంపీ మాట్లాడుతూ తమ స్వస్థలమైన కందుకూరులో విద్యార్థులకు ఉత్తమ విద్య అందాలనే లక్ష్యంతో జూనియర్ కాలేజీకి భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ భవనాన్ని వచ్చే విద్యా సంవత్సరానికల్లా పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించనుండడంతో 26 గ్రామపంచాయతీల్లోని విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఆతర్వాత వేంసూరు మండలం, నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ ఎంపీ పార్థసారథిరెడ్డి విద్యారంగ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. సత్తుపల్లిలో బండి శోభనాచలం కళాశాలకు నూతన భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఆతర్వాత కందుకూరులో సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు శంభునిగూడెంలో ఆంజనేయ స్వామి విగ్రహం, బొడ్రాయి ప్రతిష్ఠాపనకు హాజరయ్యారు. అలాగే, వెంకటపురంలో తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు గండ్ర కేశవరెడ్డి మృతి చెందగా వారు నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మారోజు సుమలత తదితరులు పాల్గొన్నారు.

సీటీ మీటర్ల వ్యవహారంలో గోల్‌మాల్

- ఇద్దరు విద్యుత్ అధికారులపై చర్యలు
- మరికొందరిపై కొనసాగుతున్న విచారణ

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో సీటీ మీటర్ల నిర్వహణ వ్యవహారంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు ఎన్పీడీసీఎల్ అధికారులు గుర్తించారు. జిల్లాలో సీటీ మీటర్ల నిర్వహణలో అక్రమాల కారణంగా సంస్థకు నష్టం జరుగుతోందని ఫిర్యాదులు అందగా, విచారణ చేపట్టారు. ఈమేరకు ఖమ్మం విద్యుత్ శాఖ హెచ్‌టీ–2 విభాగం ఏడీఈ రమేష్, ఖమ్మం సర్కిల్ ఆపరేషన్స్ కార్యాలయం ఏఈ లక్ష్మణ్‌రావు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి బదిలీ వేటు వేశారు. ఖమ్మం అర్బన్ మండలం హెచ్‌టీ–2 ఏఈగా రమేష్ పనిచేసిన సమయంలో అక్రమాలు జరగగా, లక్ష్మణ్‌రావు కూడా ఖమ్మం అర్బన్ మండలంలో పనిచేసినప్పుడే అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. దీంతో ఏడీఈ రమేష్‌ను కురవి మండలానికి, ఏఈ లక్ష్మణ్‌రావును మహబూబాబాద్ సర్కిల్‌కు బదిలీ చేసినట్లు ఎస్‌ఈ సురేందర్ తెలిపారు. ఇక జిల్లాలో మరికొందరు ఉద్యోగుల వ్యవహారంపై కూడా ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టినట్లు సమాచారం. అయితే వీరిలో కొందరు తమపై చర్యలు తీసుకోకుండా పలుకుబడితో ఉన్నత స్థాయిలో ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు తెలిసింది.

మాజీని అయితే మర్చిపోతారా ?!

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం: 'మీ వద్ద ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎంతో అభివృద్ధి చేశా.. ఇప్పుడు మాజీని అయితే మాత్రం నన్ను మరిచిపోతారా? అని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశ్నించారు. మండలంలోని కోయచెలకలో అభ్యుదయ రైతు రామారావు ఇంట్లో శుక్రవారం వివాహానికి హాజరైన తుమ్మల స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడే క్రమంలో ఈ చర్చ జరిగింది. ఈప్రాంతంతో తనకు ఎంతో అనుబంధం ఉందని చెబుతూ, చేసిన అభివృద్ధిని వివరించారు. ప్రస్తుతం మాజీని అయినంత మాత్రాన మరిచిపోవద్దని చలోక్తి విసిరారు. రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మందడపు సుధాకర్, తాతా రఘురాం, మద్దినేని వెంకటరమణ, మాదంశెట్టి హరిప్రసాద్, నున్నా శ్రీను, వెంకటేశ్వర్లు, గుత్తా వెంకటేశ్వర్లు, తోట వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్‌బండ్‌పై వాకింగ్ చేస్తున్న తుమ్మల

ట్యాంక్ బండ్‌పై విహారం

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం సాయంత్రం ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌పై కాసేపు సరదాగా గడిపారు. ట్యాంక్‌బండ్ ట్రాక్‌పై వాకింగ్ చేసిన ఆయన కేబుల్ బ్రిడ్జిని చూస్తూ సేదదీరారు.

బీజేపీకి అధికారం ఖాయం

'స్ట్రీట్ కార్నర్' సమావేశంలో పార్టీనేతలు



మాట్లాడుతున్న కడగంచి రమేష్, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎప్పుడు ఎన్నికలు వచ్చినా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమని పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు, గోవా ఇన్‌చార్జ్ కడగంచి రమేష్ అన్నారు. ఖమ్మం మార్కెట్‌యార్డు ప్రాంతంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ పిట్టల వెంకటనర్సయ్య అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటుచేసిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 400 శక్తి కేంద్రాల్లో ఈనెల 25వరకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రజలకు ఇచ్చి విస్మరించిన హామీలను వివరించడమే కాక కేంద్రప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడగా నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, రుద్ర ప్రదీప్, లక్ష్మీనారాయణగుప్త, వెంకటసత్యనారాయణ, జ్వాలా నర్సింహారావు, మంద సరస్వతి, పాపారావు, అంజయ్య, అరుణ, వెంకట్, అనిత, వీరభద్రం, సుజాత, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడా తాగునీటి ఎద్దడి రావొద్దు



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సీఈ శ్రీనివాస్, పక్కన అధికారులు

- వేసవి ఏర్పాట్లపై దృష్టి సారించండి
- ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల వర్క్‌షాప్‌లో సీఈ శ్రీనివాస్

ఖమ్మంఅర్బన్: వేసవి సమీపించినందున ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ శ్రీనివాస్ ఆదేశించారు. ఖమ్మంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లకు శుక్రవారం వర్క్‌షాప్ ఏర్పాటుచేశారు. ఈ వర్క్‌షాప్‌లో సీఈ మాట్లాడుతూ తాగునీటి పథకాలకు నీటిని అందించే చెరువులు, ఇతర వనరుల్లో నిల్వలు అడుగంటకుండా ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. తాగునీటి సమస్య ఎదురుకాకుండా అన్ని చెరువులను సాగర్ జలాలతో నింపాలని, ఇందుకోసం జలవనరుల శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. అలాగే, తాగునీటి సరఫరా సమయాన ట్యాంకులు, పైపులైన్ల వద్ద ఇబ్బంది ఎదురుకాకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రతీ హ్యాబిటేషన్‌లో ప్రత్యక్షంగా పరిశీలించి గ్రామాల్లో సర్పంచ్‌లతో సమావేశమవుతూ తాగునీటి సరఫరా పథకాలు, నిర్వహణకు అవసరమైన విద్యుత్ సరఫరాలో సమస్యలు ఎదురుకాకుండా చూడాలని సూచించారు. మిషన్ భగీరథ ఏజెన్సీల నిర్వహణ గడువు ముగుస్తున్నందున, ఎక్కడైనా చిన్నచిన్న మరమ్మత్తులు, ఇతరత్రా పనులు ఉంటే పూర్తి చేయించుకోవాలని సీఈ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఈ సదాశివం, ఈఈలు పుష్పలత, తిరుమలేష్, వాణిశ్రీ, నళినితో పాటు డీఈలు, జేఈలు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏం తమాషా చేస్తున్నారా?!

- కాంట్రాక్టర్‌కు నోటీసు కాదు, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి
- ట్యాంక్ బండ్ పనుల్లో జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం





ఇరిగేషన్ డీఈఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ గౌతమ్, మహిళకు కళ్లద్దాలు తొడుగుతున్న కలెక్టర్

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బాలసముద్రం చెరువు మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంపై కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పర్యటనకు శుక్రవారం వచ్చిన ఆయన బాలసముద్రం చెరువు వద్ద ఆగి పరిశీలించారు. ఐదేళ్లుగా ట్యాంక్ బండ్ పనులు ఎందుకు పూర్తి కావడం లేదని ఆరా తీస్తూ ఇరిగేషన్ డీఈఈ మన్మథరావుపై మండిపడ్డారు. 'జిల్లాలోని పలుచోట్ల ట్యాంక్ బండ్ పనులు పూర్తయినా ఇక్కడ ఎందుకు కావడం లేదు.. కాంట్రాక్టర్ మీ ఆజమాయిషీలో ఉన్నారా... మీరు ఆయన కంట్రోల్‌లో ఉన్నారా' అంటూ ప్రశ్నించారు. నోటీసులు ఇస్తామని డీఈఈ చెప్పడంతో మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటీసులు కాదు... బ్లాక్ లిస్టులో పెట్టండని ఆదేశించారు.

తనిఖీ ఉందని తెలిసినా సెలవా?

ఇక నేలకొండపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ మన ఊరు – మన బడి పనులను పరిశీలించి వివరాల కోసం ఎంఈఓ, హెచ్‌ఎంను పిలిచారు. అయితే, వారిద్దరు సెలవులో ఉన్నారని తెలియడంతో అసహనం వ్యక్తం చేస్తూ తాను తనిఖీకి వస్తున్నట్లు తెలిసినా సెలవు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. అక్కడకు డీఈఓ కూడా రాకపోవడంతో అందరూ వచ్చి తనను కలవాలని ఆదేశించారు. అనంతరం సింగారెడ్డిపాలెం పాఠశాలను సందర్శించిన కలెక్టర్ రామదాసు మందిరంలో ఆడిటోరియం, బౌద్ధక్షేత్రంలో పర్యాటక అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈక్రమంలో భక్తరామదాసు సర్వీస్ సొసైటీకి పంచాయతీ స్థలాన్ని అప్పగించినట్లు ఆర్‌టీఐ కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ ఫిర్యాదు చేయడంతో వెంటనే ఉత్తర్వులను రద్దు చేయాలని ఎంపీడీఓ జమలారెడ్డిని ఆదేశించారు. ఇక మండల కేంద్రంలోని కట్టలమ్మ చెరువును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, ఆర్ అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, తహసీల్దార్ దారా ప్రసాద్, సర్పంచ్‌లు రాయపూడి నవీన్, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్టైలిష్‌గా అద్దాలు

నేలకొండపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్ గౌతమ్ వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా నాగమ్మ అనే మహిళకు సిబ్బంది కంటి అద్దాలు ఇవ్వగా, స్టైలిష్‌గా ఉన్నాయంటూ కలెక్టర్‌కు ఆమెకు స్వయంగా తొడిగారు.

న్యూస్‌రీల్

ఖమ్మం కళాపరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా రవి, విజేత



నూతన కార్యవర్గాన్ని సత్కరించిన ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం కళాపరిషత్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ప్రస్తుత అధ్యక్షుడు వీ.వీ.అప్పారావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఎన్నిక జరిగింది. ఈమేరకు గౌరవ అధ్యక్షుడిగా వీ.వీ.అప్పారావు, అధ్యక్షుడిగా డాక్టర్ నాగబత్తిని రవి, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల విజేత, కోశాధికారిగా వీవీఎస్.గిరిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, విజేత మాట్లాడుతూ 1970లో స్థాపించిన సంస్థ ఆధ్వర్యాన అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకోత్సవాలను నిర్వహించారని తెలిపారు. ఈమేరకు కళా పరిషత్‌కు మరింత గుర్తింపు తీసుకొచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్క్స్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.2.16లక్షల వితరణ




దాతలు రశీదు ఇస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్ రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు ప్రకటిస్తున్నారు. ఈక్రమంలోనే కైకొండాయిగూడెంకు చెందిన సిరికొండ రవీంద్రబాబు–మంగమ్మ దంపతులు శుక్రవారం రూ.2,16,116ను ఆలయ కమిటీ బాధ్యులకు అందజేశారు. విదేశాల్లో ఉంటున్న తమ కుమారులతో సహకారంతో ఈ నగదు ఇచ్చినట్లు తెలిపారు. ఆలయ చైర్మన్ కొమ్ము భాస్కర్‌తో పాటు సూరంశెట్టి నర్సింహారావు, గుండోజి రామాచారి, ఆదిత్య, వార్షిక, శ్రీకాంత్, మద్దినేని ప్రసాద్, సిరికొండ వెంకటనారాయణ, యలమందల రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరకు 1,23,706 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 31,058 మందికి కళ్లద్దాలు అందజేశారు. మరో 18,896 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసులు అవసరమని గుర్తించి ఆర్డర్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

వెంట పడండి.. పనులు చేయించండి



ఇంజనీర్లతో సమీక్షిస్తున్న సీఈ శంకర్‌నాయక్

ఖమ్మంఅర్బన్: గడిచిన రెండేళ్లలో జిల్లాకు మంజూరైన ఇరిగేషన్ పథకాల్లో మిగిలిన పనులను మార్చి ఆఖరు నాటికి పూర్తిచేసేలా కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకురావాలని జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్ ఇంజనీర్లను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన ఎస్‌ఈలు, ఈఈలతో సమావేశమై 2021–22, 2022–23లో మంజూరైన అన్ని పనులు మార్చి నెలాఖరుకు పూర్తిచేయించాలని స్పష్టం చేశారు. సాగునీటి పథకాలు, కాల్వల వెంట మిగులు భూములను గుర్తించి హద్దులు ఏర్పాటుచేయాలని సూచించారు. ఖమ్మం, కల్లూరు ఎస్‌ఈలు నర్సింగరావు, ఆనందకుమార్, ఈఈలు ఎం.వెంకటేశ్వర్లు, అనన్య, శ్రీనివాసాచార్యులు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

సత్తుపల్లిరూరల్: మండలంలోని చెరుకుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులను జాతీయ జనవనరుల సంఘం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.రవీందర్, జాతీయ వనరుల కమిషన్ సైంటిస్ట్ బీ.కే.మొహంతి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా చెరువు పూడికతీత, హార్టికల్చర్, ఫాంపాండ్లు, సోక్‌పిట్లు, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీఓ సుభాషిణి, సర్పంచ్ ఇరపా లలిత, ఈజీఎస్ ఏపీఓ బాబురావు, ఎంపీఓ కృష్ణ, ఉద్యోగులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాగశ్రీను, విజయ్‌బాబు, దీప్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్పొరేట్ల చేతిలో దేశ సంపద

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: దేశ సంపదను కేంద్రప్రభుత్వ పెద్దలు కార్పొరేట్లకు దోచి పెడుతున్నారని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు విమర్శించారు. దేశ సంపదను అడ్డదారిలో అదానీ వంటి వారికి అప్పగించడంతో వారు ఆర్థికంగా బలోపేతమవుతున్నారని పేర్కొన్నారు. ఖమ్మం గిరిప్రసాద్ భవనంలో అజ్మీరా రామ్మూర్తి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చకపోగా, సంపన్నుల కొమ్ము కాస్తోందని ఆరోపించారు. ఇక తెలంగాణలో విద్యుత్ కోతలు రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నందున నిరంతరం సరఫరా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే, సాగర్ జలాల విడుదలలో వారబందీ విధానం తొలగించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌తో పాటు నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

ఖమ్మం సహకారనగర్: మధిర నియోజకవర్గంలో పెండింగ్‌లో రహదారుల పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సూచించారు. ఖమ్మంలో శుక్రవారం ఆయన ఆర్ అండ్ బీ అధికారులతో సమావేశమై నియోజకవర్గంలోని రహదారులు, శివరాత్రి జాతర జరిగే ప్రాంతాల్లో అభివృద్ధి పనులపై సూచనలు చేశారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

చింతకాని: మండలంలోని చినమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. మున్నేరు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో ఆర్‌ఐ ఉష ఆధ్వర్యాన తనిఖీ చేపట్టి ఐదు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నారని తహసీల్దార్ మంగీలాల్ తెలిపారు. అనంతరం ట్రాక్టర్లను పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

బంగారు గొలుసు చోరీ

కల్లూరు: కిరాణం షాపు నుంచి ఇంటికి వస్తున్న ఓ మహిళ మెడలో నుంచి దుండగులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. కల్లూరుకు చెందిన పసుమర్తి సుశీల తన షాపు మూసేసి శుక్రవారం రాత్రి ఇంటికి వస్తుండగా, బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు రూ.2.50లక్షల విలువైన బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో సీఐ హనూక్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

వైద్యం అందక 'గుండె' బాధితుడి మృతి

నేలకొండపల్లిలో డాక్టర్ లేకపోవడంతో ఘటన



మృతి చెందిన భద్రయ్య

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సమయానికి వైద్యం అందగ, గుండె సంబంధిత బాధితుడికి ఖమ్మం తీసుకెళ్లే క్రమాన మార్గమధ్యలోనే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు... నేలకొండపల్లి మండలంలోని కోనాయిగూడెంకు చెందిన గోరెంట్ల భద్రయ్య(59)కు శుక్రవారం సాయంత్రం గుండెపోటు రాగా, కుటుంబీకులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ సమయానికి వైద్యులు లేకపోవటంతో నర్స్ ప్రథమ చికిత్స చేశాక ఖమ్మం తీసుకెళ్లాలని సూచించారు. అయితే, 108 కూడా లేకపోవడంతో కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనంలో ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో భద్రయ్య మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఆస్పత్రి వైద్యుల తీరుపై మండిపడ్డారు.

భర్త చేతిలో భార్య హతం?

రఘునాథపాలెం: మండలంలో ఈర్లపూడిలో భర్త కొట్టిన దెబ్బలు తాళలేక మహిళ మృతి చెందినట్లు సమాచారం. గ్రామానికి చెందిన భాస్కర్‌రావుకు ఆయన భార్య కృష్ణవేణి (35)తో శుక్రవారం సాయంత్రం ఘర్షణ జరిగింది. దీంతో ఆయన పీటతో ఆమె తలపై మోదడంతో తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయినట్లు తెలిసింది. కాగా, ఘర్షణ అనంతరం ఆమె ఉరి వేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో కృష్ణవేణిని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. ఈమేరకు అందిన సమాచారంతో విచారణ చేపట్టినట్లు ఎస్సై రవి తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పత్తి	7,700	6,200
కందులు	7,056	6,950
మిర్చి	18,200	12,000
తాలు మిర్చి	7,700	6,200

– ఖమ్మం వ్యవసాయం

రామయ్యకు నిధులేవి..?



రామాలయం వ్యూ

భద్రాద్రి రామాలయానికి రూ.100 కోట్ల కోసం ఎదురుచూపులు

- ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి తొమ్మిదేళ్లు..
- తాజాగా కొండగట్టు ఆంజనేయస్వామికి నిధులు మంజూరు

భద్రాచలం: రామబంటుగా పేరొందిన ఆంజనేయ స్వామి కొలువుదీరిన కొండగట్టు ఆలయానికి రూ.100 కోట్లు విడుదల చేస్తూ సీఎం కేసీఆర్ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేశారు. ఇది హర్షణీయమే అయినా.. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తామని తొమ్మిదేళ్ల క్రితం ప్రకటించి.. నేటికీ విడుదల చేయకపోవడం పట్ల భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

2014లో ప్రకటించారు..

రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో 2014లో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా భద్రాచలం వచ్చారు. స్వామివారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు కేటాయిస్తున్నామని, మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నామని వెల్లడించారు. ప్రముఖ ఆర్కిటెక్ట్, సినీ ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి నేతృత్వంలో పలు డిజైన్లను సైతం రూపొందించారు. ఇక అంతటితోనే చేతులు దులుపుకున్నారు. డిజైన్లు అటకెక్కాయి. ఇక ఆ తర్వాత జరిగిన బడ్జెట్ సమావేశాల్లోనూ రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించినా నేటికీ నిధులు రాలేదు. ఆ తర్వాత శ్రీరామనవమి వేడుకలకు సైతం కేసీఆర్ హాజరు కాలేదు. రెండోసారి పదవీ కాలం కూడా ముగింపు దశకు వస్తున్నా అటు ప్రభుత్వం, ఇటు అధికార బీఆర్ఎస్ నాయకులు పెదవి విప్పటం లేదు. భద్రాచలం వాసులు, ప్రతి పక్ష పార్టీల ఆధ్వర్యంలో భద్రాచల దేవస్థానం, భద్రాచలం పట్టణాన్ని అభివృద్ధి చేయాలని పలు నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఇలా భద్రాచలంవాసులు అసంతృప్తిగా ఉన్న సమయంలోనే కొండగట్టు అంజన్న దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం నిధులను కేటాయించి, భద్రాచలంపై మాట్లాడకపోవడంపై ప్రజలు ఆగ్రహావేశాలను వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వమే అధికారికంగా జరపాలి



భద్రాచలంలో ప్రముఖంగా జరిగే ఉత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి. ఈ ఏడాది మార్చిలో జరగబోయే శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేకం వేడుకలను ప్రభుత్వం ప్రత్యేక ఉత్సవాలుగా ప్రకటించి నిధులు కేటాయించాలి. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రూ.100 కోట్లను తక్షణమే విడుదల చేసి రామభక్తుల మనోభావాలకు విలువ ఇవ్వాలి.

– చల్లగుళ్ల నాగేశ్వరరావు, టీఎస్‌జీవోస్ జిల్లా మాజీ అధ్యక్షుడు, భద్రాచలం

శ్రీరామనవమికి ఏటా నిధులు ఇవ్వాలి

ప్రతి ఏడాది భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలకు ప్రభుత్వం తరఫున నిధులు విడుదల చేయాలని భక్తులు కోరుతున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలోనే సుమారు కోటి రూపాయలకు పైగా వ్యయంతో శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదాయ, వ్యయాలు అటు ఇటుగా ఉంటుండటంతో భద్రాచల దేవస్థానం ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచల పుణ్యక్షేత్రంలో జరిగే శ్రీరానవమి ఉత్సవానికి ప్రభుత్వమే అధికారికంగా నిధులను విడుదల చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర తరహాలో పెద్ద ఎత్తున నిధులను విడుదల చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని భక్తులు వేడుకుంటున్నారు. ఈ ఏడాది ప్రతి పన్నెండేళ్లకోసారి జరిగే పుష్కర పట్టాభిషేక మహోత్సవం భద్రాచలంలో జరగనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను సైతం అధికారులు ఇటీవల విడుదల చేశారు. పుష్కర సంవత్సరాలకు జరిగే పట్టాభిషేకం మహోత్సవాన్ని కనీవినీ ఎరుగని రీతిలో జరపాలని దేవస్థానం వైదిక సిబ్బంది, అధికారులు భావిస్తున్నారు. దీంతో ఈ ఉత్సవాలకు మేడారం జాతర తరహాలో పెద్ద ఎత్తున నిధులను కేటాయించి విడుదల చేయాలని, భక్తులకు సకల ఏర్పాట్లు, వసతులను కల్పించాలని భక్తులు, భద్రాద్రి వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'పువ్వాడ' దంపతులను ఆశీర్వదించిన ప్రముఖులు



వధూవరులకు శుభాకాంక్షలు చెబుతున్న కలెక్టర్ గౌతమ్, చిత్రంలో మంత్రి పువ్వాడ, ఖమ్మం సీపీ వారియర్, భద్రాద్రి ఎస్పీ వినీత్, ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోదరుడు ఉదయ్‌కుమార్ తనయుడు పువ్వాడ నరేన్ రాజ్ వివాహం సాయి షిరిణితో ఇటీవల జరగగా, ఖమ్మంలో శుక్రవారం రిసెప్షన్ నిర్వహించారు. తొలుత సర్వమత ప్రార్థనలు నిర్వహించి నూతన వధువరులను ఆశీర్వదించారు. ఇక ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, ఖమ్మం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, భద్రాద్రి ఎస్పీ వినీత్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, సినీ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర నాయకులు చాడా వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

1998 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి



ఎమ్మెల్యే వెంకటవీరయ్యకు వినతిపత్రం అందజేస్తున్న అభ్యర్థులు

సత్తుపల్లి: ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు 1998లో నిర్వహించిన డీఎస్సీలో ప్రభుత్వం నిర్దేశించిన కనీస అర్హత మార్కులు(కటాఫ్) సాధించిన అభ్యర్థులకు తెలంగాణ ఉద్యమ సమయాన ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నెరవేర్చాలని 1998 డీఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ ఓ ప్రకటనలో కోరారు. ఉన్నత విద్యనభ్యసించి డీఎస్సీలో అర్హత సాధించిన తాము 24ఏళ్లుగా నష్టపోతున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయాన హామీ ఇవ్వడమే కాక తమ బృందంతో చర్చించిన కేసీఆర్ ఇచ్చిన హామీని అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అక్కడి అభ్యర్థులు 4,567 మందికి ఉద్యోగాలు ఇవ్వడానికి నిర్ణయించినందున, తెలంగాణలో కూడా 1,500 మంది వరకు ఉన్న అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. కాగా, ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేయాలని శుక్రవారం సత్తుపల్లిలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఖమ్మంలీగల్: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించేందుకు గాను శ్రద్ధగా చదువుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సూచించారు. ఖమ్మం త్రివేణి పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన న్యాయ అవగాహన సదస్సులో జిల్లా జడ్జి మాట్లాడుతూ బాల్యవివాహాలు, వరకట్నం, బాల కార్మిక వ్యవస్థ తదితర దురాచారాలపై నిర్మూలనపై అవగాహన కల్పించారు. విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకునేందుకు చదువుపైనే దృష్టి సారించాలే తప్ప సెల్‌ఫోన్ల జోలికి వెళ్లొద్దని సూచించారు. అనంతరం ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ రాష్ట్రస్థాయి పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను జడ్జి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, న్యాయవాదులు ఇమ్మడి లక్ష్మీనారాయణ, జనార్దన్, పాఠశాల డైరెక్టర్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ ప్రసాద్‌తో పాటు కావ్య, రూప తదితరులు పాల్గొన్నారు.

విషం కక్కుతున్న బీజేపీ ఐటీ సెల్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: దేశవ్యాప్తంగా కులాలు, మతాల నడుమ చిచ్చు పెట్టేలా బీజేపీ శ్రేణులు ఐటీ సెల్ ద్వారా ప్రయత్నిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. ఇలాంటి యత్నాలను తిప్పికొట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం జిల్లా సోషల్ మీడియా వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. సామాజిక మాధ్యమాల ద్వారా బీజేపీ శ్రేణులు విషం కక్కుతూ పచ్చి అబద్ధాలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వందలాది మంది ఉద్యోగులను నియమించి తప్పుడు ఐడీలతో లౌకిక పార్టీల విధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కేంద్రప్రభుత్వ విధానాలు, కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్న తీరుపై ప్రశ్నించిన వారిపై దేశ ద్రోహులుగా ముద్ర వేయడంలో బీజేపీ ఐటీ సెల్ ముందు ఉందని మండిపడ్డారు. ఈమేరకు బీజేపీ అబద్ధ ప్రచారాలను సీపీఎం శ్రేణులు ఆధారాలతో ఎండగట్టాలని తమ్మినేని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు పిట్టల రవి, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరా తీస్తూ.. హామీలు ఇస్తూ...

- కామేపల్లి మండలంలో సాగిన రేవంత్‌రెడ్డి పాదయాత్ర
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని కష్టాలూ తీరుతాయని వెల్లడి



హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న రేవంత్‌రెడ్డి

కామేపల్లి(కారేపల్లి): అభివృద్ధి జరగాలన్నా, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు దక్కాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోయాత్ర శుక్రవారం ఉదయం కామేపల్లి మండలం లచ్చాతండా మొదలై బర్లగూడెం స్టేజీ, పాన్నెకల్ స్టేజీ, బండిపాడు స్టేజీ, గోవింద్రాల, పాతలింగాల స్టేజీ, కొత్తలింగాల సెంటర్ వరకు సాగింది. ఈసందర్భంగా మార్గమధ్యలో పలు ఇళ్లకు యాత్ర స్టిక్కర్లు అంటించిన రేవంత్.. బీఆర్ఎస్ విధానాలను వివరించడమే కాక తాము అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను వివరించారు. లచ్యాతండా వద్ద మిర్చితోటలో మిర్చి వేరుతున్న ఒడిశా కూలీలు, విద్యుత్ కోతలు ఎత్తేయాలని పాన్నెకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులను కలిసి సమస్యలపై ఆరా తీశారు. ఖమ్మం నుంచే గతంలో చాలా ఉద్యమాలు ప్రారంభమయ్యాయని.. చైతన్యవంతులైన జిల్లా ప్రజలు తిరగబడితే బీఆర్ఎస్ నేతలను దేవుడు కూడా కాపాడలేడన్నారు. ఇక రాయగూడెంలో గౌడ కులస్తులు, బండిపాడు స్టేజీ వద్ద ఇటుక బట్టీ కార్మికులు, మహిళాసంఘాల సభ్యులతో మాట్లాడమే కాక ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎస్కే.సోనాకృపాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక జనవరి 5న విధుల్లో ఉండగా మరణించిన జవాన్ భూక్యా రమేష్ భార్య రేణుక తన ముగ్గురు పిల్లలతో రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడింది. దీనస్థితిలో ఉన్న తమకు రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ఉపాధి కల్పించేలా చూడాలని కోరగా ఆయన భరోసా కల్పించారు. కాగా, గోవింద్రాలలో దివంగత సీఎం వైఎస్సార్, కొత్త లింగాల సెంటర్‌లో మాజీ మంత్రి రాంరెడ్డి వెంకట్‌రెడ్డి, అంబేద్కర్ విగ్రహాలకు రేవంత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంపీ పోరిక బలరాం నాయక్, నాయకులు, ప్రజాప్రతినిధులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, బానోతు వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, గింజల నరసింహారెడ్డి, రాంరెడ్డి కృష్ణారెడ్డి, చీమల వెంకటేశ్వర్లు, రాంచందర్‌నాయక్, దేవండ్ల రామకృష్ణ, నల్లమోతు లక్ష్మయ్య, కవిరాజ్, మద్ది శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గౌడ కులస్తుల గోడు వింటున్న రేవంత్‌రెడ్డి



లింగాల క్రాస్ రోడ్డు సభలో మాట్లాడుతూ..



పాఠశాల విద్యార్థులతో రేవంత్ కరచాలనం

తుపాకీ వాడకంపై శిక్షణ ఇస్తుండగా మిస్‌ఫైర్

అమెరికాలో మధిర వాసి సాయి మృతిపై కొనసాగుతున్న దర్యాప్తు



పోలీసులు విచారిస్తున్న రవితేజ

మధిర: అమెరికాలోని మార్ట్‌లో గన్ మిస్ ఫైర్ అయిన ఘటనలో మృతి చెందిన మధిర చెందిన అఖిల్ క్రావిక్(సాయి) మృతదేహం భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం న్యూజెర్సీకి చేరుకుందని ఆయన కుటుంబీకులకు సమాచారం అందింది. అమెరికాలో ఎమ్మెస్ చేస్తున్న సాయి, రవితేజ మిత్రులు కాగా, వీరిద్దరు ఒక గ్యాస్ స్టేషన్‌లో పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తున్నారు. ఈక్రమంలో రక్షణ కోసం వీరికి గ్యాస్ స్టేషన్ యాజమాన్యం తుపాకీ ఇవ్వగా, బుల్లెట్లు లోడ్ చేసి కాల్చడం.. అన్‌లోడ్ చేయడంపై అఖిల్‌కు రవితేజకు శిక్షణ ఇచ్చినట్లు సమాచారం. ఆతర్వాత అన్‌లోడ్ చేసే సమయాన గన్‌లోనే ఒక బుల్లెట్ మిగిలిపోయింది. ఈ విషయం గమనించని రవితేజ ట్రిగ్గర్ నొక్కడంతో బుల్లెట్ అఖిల్ తలలోకి దూసుకుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడి ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన విషయం విదితమే. ఈమేరకు ఎన్నారైలు, సాయి స్నేహితులకు మృతదేహాన్ని అప్పగించగా వారు న్యూజెర్సీకి తరలించారు. అక్కడి నుంచి మధిరకు రావడానికి రెండు, మూడు రోజులు పడుతుందని సమాచారం. ఇప్పటికే రవితేజను అదుపులోకి తీసుకున్న అక్కడి పోలీసులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

నడిరోడ్డుపై మహిళ నిరసన

కూసుమంచి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రహదారిపై ఓ మహిళ శుక్రవారం తన కుమారుడితో బైఠాయించి నిరసన తెలియజేసింది. మండలంలోని గట్టుసింగారానికి చెందిన లోడిగ కృష్ణవేణి తన వరి పొలంపై కొందరు కలుపుమందు కొట్టడంతో పంట చనిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా పట్టించుకోలేదని ఆరోపిస్తూ రహదారిపై బైఠాయించగా, సమాచారం పోలీసు సిబ్బంది చేరుకుని ఆమెకు న్యాయం చేస్తానని చెప్పి ఆందోళన విరమింపజేశారు. కాగా, కృష్ణవేణి భర్త వెంకటనారాయణ, ఆయన సోదరుడు వెంకన్న నడుమ కొన్నేళ్ల నుంచి భూవివాదం కొనసాగుతోంది. దీంతో వారు తరచుగా పోలీసులను ఆశ్రయిస్తుండడమే కాక కృష్ణవేణి ఇలా నిరసన వ్యక్తం చేయటం రెండోసారి కావడం గమనార్హం.